క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రండి



రంజిత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి అయ్యప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు విచ్చేయాలని శనివారం ఎంపీ రంజిత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఓటర్ జాబితాను సరిచేయండి

తహసీల్దార్ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొందుర్గు: ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేయాలని జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు యాప్‌లు లాగిన్ చేసుకోవాలని, పీఎస్‌ఈ రిపోర్ట్‌లు తయారు చేయాలన్నారు. మృతి చెందిన, వలస వెళ్లిన, రెండు చోట్ల నమోదైన ఓటర్ల వివరాలను సిద్ధం చేయాలని చెప్పారు. అలాగే, కొత్త ఓటర్ల నమోదు చేయాలని సూచించారు. వయోవృద్ధులు, వికలాంగులను గుర్తించాలని అన్నారు. సమావేశంలో వివిధ గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కొట్టేస్తున్నారు..



ఏపుగా పెరిగిన చెట్లను కొట్టేసిన తీరు

కొందుర్గు: ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ప్రతి పల్లెలో నర్సరీలు ఏర్పాటు చేసి ప్రతిఏటా లక్షలాది మొక్కలను నాటిస్తుంది. మొక్కల సంరక్షణ కోసం మూడేళ్లపాటు రోజుకు ఒక మొక్కకు రూ. 5 ఖర్చు చేయడం జరుగుతోంది. అధికారులు, పాలకుల అవగాహన లోపం ఓ వైపు నాటుతున్నారు..మరో వైపు నరుకుతున్నారు..అన్న చందంగా మారింది. మొక్కలు నాటే సమయంలో హడావిడిగా రోడ్లకు ఇరువైపులా నాటిస్తున్నారు. ఇక కరెంట్ తీగలకు చెట్లు తగులుతున్నాయని, పైపులైన్లకు అడ్డంగా వస్తున్నాయని చెట్లను యథేచ్ఛగా కొట్టేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ముందుచూపుతో వ్యవహరించాలని కోరుతున్నారు. ప్రజల సొమ్ము వృథా కాకుండా జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు.

‘నేలతల్లి’ సేవలు అభినందనీయం



సర్పంచ్‌కు మొక్కలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు నేలతల్లి ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌ను కలిసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు యువత ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. ఫౌండేషన్‌కు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఫౌండేషన్ నిర్వాహకులు సర్పంచ్‌కు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో నేలతల్లి ఫౌండర్ చంటి, సభ్యులు జయేందర్, రామ్‌తేజ్, ముఖేశ్ నాయకులు వెంకటేశ్, అంజి, శ్రీనివాస్ తదితరులున్నారు.

నిరుపేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్: డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.60లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి వారానికి మూడుసార్లు రక్తశుద్ధి చేయాల్సి ఉంటుంది, ఇది ఎక్కువ ఖర్చుతో కూడుకున్న చికిత్స అని చెప్పారు. నిరుపేదలకు శక్తికి మించిన భారంగా మారుతుందన్నారు. అయితే, షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నీ రోగుల కోసం నాలుగు అత్యాధునిక పరికరాలతో కొత్తగా డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కిడ్నీ సమస్య లతో బాధపడుతున్న వారికి ఉచితంగా రక్తం శుద్ధి చేయడం జరుగుతుంది. డయాలసిస్ రోగులకు ప్రభుత్వం బస్‌పాస్ సౌకర్యం కల్పించడంతో పాటు పెన్షన్ కూడా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ గణేశ్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, కమిషనర్ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో బస్తీబాట

పట్టణంలోని 28, 17, 19, 20, 21 వార్డుల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. షాద్‌నగర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు.

బటర్ ఫ్లై లైట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

పట్టణంలోని చౌరస్తా నుంచి వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు నూతనంగా నిర్మించిన పాత జాతీయ రహదారి మధ్యలో బటర్ ఫ్లై లైట్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.80లక్షల వ్యయంతో విద్యుదీకరణ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పేదలందరికి ప్రభుత్వ సాయం

కొత్తూరు: ఆయా పథకాలతో ప్రభుత్వం పేదలందరికి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని పెంజర్లకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తన నివాసంలో శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందే పేదలను ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. విడతల వారీగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసినట్లు వివరించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన పలు శస్త్రచికిత్సలే ఇందుకు ఉదాహరణగా చెప్పారు. కేసీఆర్ కిట్‌తో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎమ్మె సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, భీమయ్య, బాల్‌రాజు, రమేష్, జైపాల్, సత్తయ్య, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

అనుమతిలేని స్కూళ్లపై చర్యలకు డిమాండ్

పీడీఎస్‌యూ నాయకుడు రాజేశ్

చేవెళ్ల: పర్మిషన్ లేకుండా అడ్మిషన్లు ప్రారంభిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో అనుమతి లేకుండా అడ్మిషన్లు ప్రారంభించిన శ్రీచైతన్య టెక్నో స్కూల్‌ని పీడీఎస్‌యూ నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే శ్రీచైతన్య టెక్నో స్కూల్ అని బోర్డులు పెట్టి అడ్మిషన్ల ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. అధికారులు చూసీచూడనట్లుగా వదిలేయడంతో వారు ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీతో అడ్మిషన్లు ప్రారంభించారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యలతో విద్యాధికారులు కుమ్మక్కైనట్లు స్పష్టంగా అర్థమవుతుందని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని, ఫీజుల దోపిడీపై నియంత్రణ విధించాలన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు జైపాల్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లావణ్య

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కార్యాలయం ఆవరణలో శనివారం ఆమె రీయూజ్, రీసైకిల్, రెడ్యూజ్(ఆర్ఆర్ఆర్) కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రజలు తమ ఇళ్లలో నిరుపయోగంగా ఉండే బట్టలు, ప్లాస్టిక్, ఇనుప వస్తువులను మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. ప్రజలు ఇచ్చే వస్తువుల్లో వినియోగానికి వచ్చే వాటిని పరిశీలించి పేదలకు అందించడం..పనికి రాని వస్తువులను పరిశ్రమలకు తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వ్యర్థాలు బయట కనిపించవన్నారు. ఇప్పటికే వ్యర్థాల కారణంగా భూతాపం అమాంతం పెరిగి ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు వివరించారు. ‘ఆర్ఆర్ఆర్’కు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ వీరేందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

నార్సింగి ఏసీపీ రమణగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమణగౌడ్

శంకర్‌పల్లి: ఒక్క సీసీ కెమెరా వంద నేత్రాలతో సమానమని నార్సింగి ఏసీపీ రమణగౌడ్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని మణిగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శంకర్‌పల్లి పోలీసులు, మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ నియంత్రణపై సమావేశం నిర్వహించారు. పోలీసులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వారి వారి ఇళ్లల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి ఏర్పాటు చేసుకోలేని వారు కాలనీల్లోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రతి కెమెరాను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వ్యాపారులు మున్సిపల్ ఆదేశాలను బేఖాతరు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తడి, పొడి చెత్తలను వేరుగా చేసి మున్సిపల్ రిక్షాల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, ఎస్‌ఐలు కృష్ణ, సంతోష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్టు, రిమాండ్

చేవెళ్ల: బైక్ దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన శనివారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హయ్యూమ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్, బోరబండ చెందిన సోయల్ గత కొంతకాలంగా పార్కు చేసిన బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నాడు. మండల కేంద్రంలో ఇటీవల దుకాణాల ఎదుట పార్కు చేసిన రెండు స్కూటీలు చోరీకి గురైనట్లు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు అందాయి. మండలంలో పార్కు చేసిన బుల్లెట్ బైక్‌ను దొంగిలించి దానిపై చేవెళ్ల వైపు వెళ్తుండగా పోలీసులు తనిఖీలు చేయగా సోయల్ పట్టుబడ్డాడు. అతని ప్రవర్తన అనుమానంగా ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో అసలు విషయాలను బయటపెట్టాడు. ఇటీవల చేవెళ్లలో చోరీకి గురైన రెండు స్కూటీలతో పాటు మొయినాబాద్, పరిగిలో రెండు బుల్లెట్ బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతనిపై పలు పోలీస్‌స్టేషన్‌ల్లో 13 కేసులు ఉన్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి రెండు స్కూటీలు, బుల్లెట్ బైక్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌లకు తరలించినట్లు పోలీసులు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ అబ్దుల్ హాయ్యమ్, సిబ్బంది నరేశ్ ఉన్నట్లు పేర్కొన్నారు.

కనుల పండువగా బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

షాబాద్: కనుల పండువగా బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించినట్లు కమ్మరిగూడ సర్పంచ్ కేతన, ఎంపీటీసీ అరుణ తెలిపారు. శనివారం మండలంలోని కుమ్మరిగూడలో బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన మహోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగవైభవంగా నిర్వహించారు. అనంతరం యజ్ఞహోమాలు చేశారు. గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో పోచమ్మ, ఎల్లమ్మ, ఈరమ్మ బోనాలతో ఊరేగింపు సాగింది. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ.. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. కార్యక్రమానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు రమేశ్, ఆంజనేయులు, నారాయణ, శ్రీశైలం, పోచయ్య, మల్లయ్య, కుమార్, గ్రామస్తులు తదితరులున్నారు.

లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టును పూర్తి చేయండి

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి



కొత్తూరు: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలో లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్‌ను సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటాలు చేయనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొన్ని జిల్లాల అభివృద్ధిపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్‌రెడ్డి, అనంతయ్య, ఆంజనేయులు నర్సింలు, కృష్ణ, మహేష్, శ్రీకాంత్, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్ నిర్మించాలి

కేశంపేట: లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్ పనులను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరేశ్ డిమాండ్ చేశారు. అఖిలపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను శనివారం కాంగ్రెస్ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌ను మార్చిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తేనే షాద్‌నగర్ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, ఎంపీటీసీ రాజు, భాస్కర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పర్వతాలు, రాములు, పెంటయ్య, దత్తురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

సర్పంచుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి

మొయినాబాద్ రూరల్ : బాకారం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని సర్పంచుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాఘవరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బాకారంలో సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. 111 జీఓను ఎత్తివేయడం చేవెళ్ల నియోజకవర్గంలో 84 గ్రామాల అభివృద్ధికి మరింత అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతి రెడ్డి, గ్రామస్తులు పెంటారెడ్డి, నారాయణపురం నరేందర్ ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అధ్యక్షతన ఫరూఖ్‌నగర్‌లోని చించోడ్, బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గుల, చించోడ్ పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి, డాక్టర్ రాఘవేందర్‌లు ఆస్పత్రుల్లో రోగులకు కావాల్సిన కనీస సదుపాయాలను కల్పించాలని కోరారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు కావాల్సిన సదుపాయలన్నింటిని కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అత్యవసర వైద్యానికి సంబంధించిన మందులు వైద్యాధికారులు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ శంకర్‌రాథోడ్, చించోడ్ సర్పంచ్ బాలమణి, డాక్టర్లు స్రవంతి, రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఓ శ్రావణ్‌కుమార్, సీడీపీఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాలి

కొందుర్గు: ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంజనేయులు హాజరై మాట్లాడారు. అధికారులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా సంఘాల సభ్యులు ఆస్పత్రి అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. అందరి సలహా, సూచనలతోనే ఆస్పత్రి ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో తబుసుమ్, సర్పంచ్ ఆదిలక్ష్మి, పీఏసీఆర్ ఏఈ దయాకర్‌రావు, పీహెచ్‌ఎన్ ప్రభులింగం,ఏఎన్‌ఎంలు సుజాన్, సంధ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సమస్యలపై చర్చ

కేశంపేట: కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జన ఆరోగ్య సమితి సమావేశం ఎంపీపీ రవీందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి, తొమ్మిదిరేకుల, ఎక్లాస్‌ఖాన్‌పేట ఉపకేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. సిబ్బంది కొరత, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం, మందుల శీతలీకరణకు కావాల్సిన రిఫ్రిజిరేటర్, ఈసీజీ యంత్రం కొనుగోలు, ఖాళీపోస్టుల భార్తీ , డిప్యూటేషన్ల రద్దును చేయాలని సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ విశాల, డాక్టర్ నిఖిత, ఎంఈఓ మనోహర్, హెచ్‌ఎం రసూల్, ఎంపీడీఓ రాంచంద్రకుమార్‌రెడ్డి, ఏఈ భూపాల్, వెంకట్‌రెడ్డి, ఇందిరమ్మ, ఎంపీటీసీలు లక్ష్మమ్మ, హెచ్‌ఈఓ ఆంజనేయులు, శేఖర్, హన్మంతు, పుష్ప పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

కొందుర్గు: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని ఈ నెల 22న షాద్‌నగర్‌లో చేపట్టనున్న అఖిలపక్ష మహాధర్నాను విజయవంతం చేయాలని పలు రాజకీయ పార్టీల నాయకులు కోరారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజల నీటి కష్టాలు తీరుతాయన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరు, తాగునీరు లభిస్తుందని, ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. ధర్నాకు అన్ని గ్రామాల నుంచి రైతులు, యువజన, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, డీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు భిక్షపతి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య పాల్గొన్నారు.